క్లుప్తంగా

నేడు ఆలయాల్లో పంచాంగ శ్రవణం

చిక్కడపల్లి: చిక్కడపల్లిలోని పలు ఆలయాల్లో ఉగాది సందర్భంగా బుధవారం పంచాంగ శ్రవణ కార్యక్రమాలు జరుగుతాయని ఆయా ఆలయాల నిర్వాహకులు ప్రకటించారు. చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో సాయంత్రం 6.30 గంటలకు ఆలయ అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ పంచాంగ శ్రవణం చేస్తారని చైర్మన్ మురళీప్రసాద్, ఈఓ దేవనాథంలు ఓ ప్రకటనలో వివరించారు. ఆర్టీసీక్రాస్ రోడ్స్ శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు పంచాంగశ్రవణం ఉంటుందని ఆలయ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఈఓ లక్ష్మారెడ్డిలు పేర్కొన్నారు.

రేపు ఉగాది పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి: వంశీ ఆర్ట్ థియేటర్స్ ఇంటర్నేషనల్, శుభోదయం గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల బహూకరణ త్యాగరాయగానసభలో ఈ నెల 23న తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సీల్‌వెల్ కార్పొరేషన్, తిరుమల బ్యాంక్ సౌజన్యంతో నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు కేవీ.రమణాచారి, అతిథులుగా యండమూరి వీరేంద్రనాథ్, ఓలేటి పార్వతీశం, బొల్లినేని కృష్ణయ్య, బండారు సుబ్బారావు, నుంగునూరి చంద్రశేఖర్, రేలంగి నరసింహారావు, కలపటపు శ్రీలక్ష్మీప్రసాద్ పాల్గొనున్నారు. ప్రముఖ కవి పండితులు మైలవరపు శ్రీనివాసరావును వంశీ శుభోదయం వేదికగా ఉగాది పురస్కారంతో సత్కరించనున్నారు. వివిధ కళారంగాల్లో నిష్ణాతులైన సుమారు 15 మందికి ఉగాది పురస్కారాలను అక్కినేని, జమున, కె.విశ్వనాథ్ మొదలైన ప్రముఖుల పేర్లతో అందజేస్తారు. కాగా.. 9 మంది ఆదర్శ దంపతులకు కూడా ఉగాది పురస్కారాలను అందజేస్తున్నామని నిర్వాహకులు ప్రకటించారు.

నేడు మున్నూరుకాపు భవన్‌లో ఉగాది వేడుకలు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను ఈరోజు సాయంత్రం 4 గంటలకు కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో నిర్వహిస్తున్నట్లు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ప్రకటించారు. ప్రముఖ విద్యావేత్త సుతారి నర్సింహులుచే ఉగాది పంచాంగ శ్రవణం ఉంటుందని తెలిపారు. మున్నూరు కాపులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

బస్టాప్ ఆధునీకరణకు చర్యలు



శివం రోడ్డులో ఏసీ బస్టాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నియోజకవర్గంలో బస్టాప్‌లను తీర్చిదిద్దేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. మంగళవారం శివం రోడ్డులో నిర్మిస్తున్న ఏసీ బస్టాప్‌ను సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. బస్టాప్‌ను సాధ్యమైనంత త్వరగా ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. స్థానిక బీఆర్‌ఎస్ నేతలు చందు, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే ఆలయాలను అభివృద్ధి చేస్తా..

అంబర్‌పేట: తనను గెలిపిస్తే అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి పరిధిలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని చింతల శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. దేవస్థాన సేవా సమితికి జరుగుతున్న ఎన్నికల్లో భాగంగా మంగళవారం ప్రచారం నిర్వహించారు. సింహం గుర్తుకు ఓటువేసి తన ప్యానల్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఉపాధ్యక్షులుగా మన్మోహన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, కార్యదర్శిగా ఎడ్ల శ్రీధర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా సంజీవచారి, కోశాధికారిగా అశోక్‌కుమార్‌లు బరిలో ఉన్నట్లు తెలిపారు.

పట్టభద్రులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి

కాచిగూడ: టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్న పత్రాల లీకేజీతో నష్టపోయిన పట్టభద్రులకు ప్రభుత్వం నిరుద్యోగ భృతిని నెలకు రూ. 5 వేల చొప్పున ఇవ్వాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రశ్న పత్రాల లీకేజీతో పరీక్షలను ప్రభుత్వం రద్దు చేయడంతో లక్షలాది మంది నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత శిక్షణతో పాటు వసతి సదుపాయాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు.

నవ వసంతానికి నాంది ఉగాది



ఓయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ రాములును సత్కరిస్తున్న దృశ్యం

కాచిగూడ: తెలుగు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విద్యార్థులు సంప్రదాయ పద్ధతిలో ఉగాది వేడుకలను నారాయణగూడ పద్మశాలి భవన్‌లో ఘనంగా నిర్వహించుకున్నారు. మంగళవారం జాగృతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకల్లో విద్యార్థులు సంస్కృతిక నృత్యాలతో ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ రాములు పాల్గొని మాట్లాడుతూ.. నవ వసంతానికి నాంది ఉగాది అని ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థులు మంచి ప్రణాళికతో నైపుణ్యాలను అలవర్చుకుని ఉన్నత విలువలతో జీవితంలో ఎదగాలని సూచించారు. విద్యార్థులంతా జీవితంలో ఉగాది షడ్రుచుల వలే అన్ని రకాలుగా సమ్మేళనంతో విద్యా నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. జాగృతి కళాశాల చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామ్‌కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లారావు, డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, రాజగోపాల్, సంతోష్ రెడ్డి, సురేష్, రాంభూపాల్‌రెడ్డి, దివ్య, సునీత, శ్రీనివాసరావు, జగదీశ్, శశికిరణ్, జాఫర్, వెంకటేశ్వర్లు, సాయికృష్ణ, పద్మజారాణి తదితరులున్నారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎన్‌జీటీస్ నెట్‌వర్క్ సౌజన్యంతో విశ్వశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉగాది జాతీయ పురస్కారాలను ప్రదానం చేశారు. వివిధ రంగాల్లో ప్రముఖులైన డాక్టర్ జల్లి విద్యాదర్‌రావు, నగేష్ నారదాసి, సినీ దర్శకులు వెంకట్, జీ.ఎన్.సాంబశివరావు, పద్మశ్రీలత తదితరులను ఉగాది పురస్కారాలతో సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ చీఫ్ కమిషనర్ ఆఫ్ కమర్షియల్ ట్యాక్స్ నర్సింహ్మప్ప మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న ప్రముఖులను గుర్తించి జాతీయ పురస్కారాలతో సత్కరించడం అభినందనీయమన్నారు. కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ, విశ్వశ్రీ ఫౌండేషన్ అధ్యక్షుడు గురుమూర్తి, ఇన్‌కమ్‌ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లవాడియా, రాజగోపాల్, వేంకటేశ్వర్‌రావు, దేవన్న, కళా తాటికొండ, డాక్టర్ యశోద పెనుబాల, మంజులసూర్య, రామసత్యనారాయణ పాల్గొన్నారు.

ఉగాది కవి సమ్మేళనం..

- దేశంలో భావ స్వేచ్ఛపై దాడి జరుగుతుందని తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందచారి ఆవేదన వ్యక్తం చేశారు. కవులు స్వేచ్ఛగా తమ భావాలను వ్యక్తీకరించే అవకాశం లేకుండా పోతోందన్నారు. మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితి నగర కమిటీ ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆనందచారి మాట్లాడుతూ.. స్వేచ్ఛ వాతావరణం లేనప్పుడు కవిత కోకిల కూయలేదన్నారు. కవులు కూడా తమ కవిత్వాన్ని చెప్పడానికి భయపడుతున్నారని విమర్శించారు. ప్రముఖ కవి, సాహితీవేత్త సలీమా, పీ.ఎస్.మూర్తి, సాహితి సంస్థ ప్రతినిధి తంగిరాల చక్రవర్తి, కవయిత్రి శైలజ మిత్ర, కవులు శ్రీనివాస్‌గౌడ్, జ్వలిత, ప్రభాకరచారి, రేఖ తదితరులున్నారు.



ఉగాది కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న కె.ఆనందచారి

‘తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలి’



బీఆర్‌ఎస్ నేతల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: రాష్ట్రంలో 40 ఏళ్లలో కాని అభివృద్ధి 9 ఏళ్లలో జరిగిందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి అంబర్‌పేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడాలేని విధంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. రాజకీయ లబ్ధి కోసం సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తూ.. ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత కోట్లాది రూపాయల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అంబర్‌పేటలో చేపట్టి దీర్ఘకాలిక సమస్యలను సైతం పరిష్కరించామన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ సహకారంతో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. నిరుపేద ప్రజలకు నిరంతరం అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, కె.సదానంద్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, మహేష్, అంటోని, బబ్లూ సింగ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ నుంచి మోజెస్ ఆధ్వర్యంలో..

ముషీరాబాద్: తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ విస్తృత స్థాయి ఆత్మీయ సమ్మేళనానికి రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు రావులపాటి మోజెస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. అంతకు ముందు రాంనగర్ చౌరస్తాలో తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. మన్నె దామోదర్‌రెడ్డి, లీలాదేవి, గజ్జల సంపూర్ణ, మంజుల, తులసీ, లక్ష్మీబాయి, సరస్వతి, నాగరాణి, మహేశ్వరి తదితరులున్నారు.



అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి గాంధీనగర్ డివిజన్ నుంచి ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ర్యాలీని డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ముడారపు రాకేష్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. డివిజన్‌లో విస్తృతంగా పాదయాత్రలు, ఆత్మీయసమ్మేళనాలు నిర్వహించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ముఠా నరేష్, శ్రీకాంత్, ఆకుల శ్రీనివాస్, సత్యనారాయణ, గడ్డమీది శ్రీనివాస్, జగదీష్‌బాబు, పీఎస్ శ్రీనివాస్, రవిశంకర్‌గుప్త, ప్రేమ్, కిరణ్, హనుమంతు, వెంకటేష్, దేవయ్య, విఠల్, జీవైగిరి, రాజ్‌కుమార్, శ్రీనివాస్, రవిశంకర్‌గుప్త, ప్రేమ్, కిరణ్, హనుమంతు, వెంకటేష్ తదితరులు తెలంగాణ భవన్‌కు తరలివెళ్లారు.

భద్రతలో మన నగరమే మొదటి స్థానం



విద్యార్థికి హెల్మెట్ బహూకరిస్తున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

అంబర్‌పేట: నగర ట్రాఫిక్, ప్రజా భద్రతలో హైదరాబాద్ నగరం దేశంలోనే ప్రథమ స్థానం ఉందని నగర ట్రాఫిక్ డీసీపీ–1 రాహుల్ హెగ్డే అన్నారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై మంగళవారం శివం రోడ్డులోని అడ్వాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ.. ఆయా వృత్తుల్లో నైపుణ్యం ఉన్న యువత రోడ్డు ప్రమాదాల బారిన పడటం కలచివేసే అంశమని ఆయన పేర్కొన్నారు.

- ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే నగరాన్ని ప్రపంచస్థాయి భద్రతా నగరంగా తీర్చిదిద్దవచ్చన్నారు.
- సమయస్ఫూర్తితో ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. అడ్వాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ విద్యానంద్, బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఏసీపీ శంకరాజు, ఇతర ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అన్నదానం

చిక్కడపల్లి: అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ముషీరాబాద్ నియోజవర్గం గాంధీనగర్ డివిజన్ ఆధ్వర్యంలో మాధవరావుకాలనీ లేన్‌లో ప్రతీనెల అమావాస్య రోజున నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని బీజేవైఎం నగర మాజీ అధ్యక్షులు ఎ.వినయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మంగళవారం ప్రారంభించారు. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి సభ్యులు రాజు దేశ్‌పాండే, ప్రేమ్‌గాంధీ సోమిశెట్టి శ్రీనివాస్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కట్టెల సుభాష్

కాచిగూడ: మున్నూరు కాపు ఐక్య పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కట్టెల సుభాష్‌ను నియమిస్తూ మంగళవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు వినోద్ కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. కాచిగూడలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ మున్నూరు కాపుల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. మున్నూరు కాపుల అందరిని ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఐక్యంగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

సంతోష్‌కు యంగ్ అచీవర్ అవార్డు



గవర్నర్ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న దృశ్యం

కాచిగూడ: దివ్యాంగుడైన సంతోష్ దేనికి వెనకడుగు వేయకుండా అన్ని రంగాల్లో తన ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి, దేశస్థాయిలో రాణించి ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. రాజ్ భవన్‌లో మంగళవారం జరిగిన ఉగాది వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ చేతుల మీదుగా దివ్య కళా ఫౌండేషన్ చైర్మన్ గంధం సంతోష్ యంగ్ అచీవర్ అవార్డును అందుకున్నారు. చిన్న తనంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకొని తన స్వశక్తితో ఎదిగి ఉన్నత విద్యాభ్యాసాన్ని పూర్తి చేసి దివ్యాంగులలో వెలుగు నింపేందుకు దివ్య కళా ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి ఎందరికో చేయూతనిచ్చారు. ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న మదర్ థెరీసా సూక్తులను స్ఫూర్తిగా తీసుకున్న సంతోష్ దివ్య కళా ఫౌండేషన్‌ను స్థాపించారు. అనంతరం దివ్యాంగులు పెరుగుతుండటంతో వారిలోని కలను వెలికి తీసేందుకు దివ్య కళా ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి సేవలందించనున్నారు. దేశ విదేశాల్లో తన ప్రతిభను చూపించి ప్రముఖులచే ప్రశంసలు పొందారు.

నూతన రోడ్డుకు ఇరువైపులా మరమ్మతులు చేపట్టాలి



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ తదితరులు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతీనగర్, సబర్మతీనగర్ బస్తీల నుంచి కొత్త లింక్ బ్రిడ్జి వరకు నూతన వీడీసీసీ రోడ్డుకు ఇరువైపులా గుంతలను మూయిస్తూ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. మంగళవారం నూతనంగా నిర్మించిన రోడ్డుకు ఇరువైపులా ఏర్పడిన గుంతలను మూయకపోవడంతో పిల్లలు, వృద్ధులతో కలిసి పర్యటించి సమస్యను పరిశీలించారు. ఫుట్‌పాత్‌కు నూతన రోడ్డుకు మధ్య ఇరువైపుల ఉన్న గ్యాస్ వల్ల స్థానిక బస్తీ వాసులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకుచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ మాట్లాడుతూ.. వెంటనే గ్యాస్‌ను మూసివేసేలా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను కోరారు. సబర్మతీనగర్ బస్తీ వద్ద దెబ్బతిన్న మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచించారు. వాటర్ వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్‌కు ఫోన్ చేసి మాట్లాడిన కార్పొరేటర్ మరమ్మతులు చేపట్టుతున్న ప్రతిచోటా కొత్త మ్యాన్‌హోల్స్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నూతన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, ఉమేష్, మహమూద్, కుమార్, రవి స్థానికులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నివారణకు చర్యలు

అంబర్‌పేట: డివిజన్‌లో వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి వీధి కుక్కలు ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిని పట్టుకునేలా చర్యలు చేపట్టారు. డివిజన్‌లో వీధి కుక్కల సమస్య పరిష్కారానికి సత్వరమే కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.



సిబ్బందితో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

జర్నలిస్టుల హెల్త్ కార్డు పరిమితి పెంచాలని గవర్నర్‌కు వినతి



కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల హెల్త్ కార్డు పరిమితి పెంచాలని కోరుతూ సీనియర్ జర్నలిస్టులు విజయేందర్ రెడ్డి, సంతోష్‌లు రాజ్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల హెల్త్ కార్డు పరిమితి పెంచే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని, పాత్రికేయుల కుటుంబాల ఆరోగ్య భద్రత విషయంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రితో మాట్లాడతానని గవర్నర్ హామీ ఇచ్చారని వారు తెలిపారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సభల పోస్టర్ ఆవిష్కరణ

ముషీరాబాద్: భారత విప్లవ వీరులు, దేశ స్వాతంత్రం కోసం తమ ప్రాణాలను తున ప్రాయంగా పెట్టిన యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతి సభలను ఈనెల 23 నుంచి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరపాలని పీడీఎస్‌యూ, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు పరశురామ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రజాస్వామిక లౌకిక విలువల పరిరక్షణ కోసం పోరాడదాం అనే నినాదంతో ఈ సభలను నిర్వహించాలని కోరారు. సమసమాజ స్థాపనే లక్ష్యంగా దోపిడీ లేని సమాజం కోసం 23 ఏళ్ల విలువైన ప్రాణాన్ని భగత్‌సింగ్ త్యాగం చేశారని కొనియాడారు. ఆయన త్యాగాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర నాయకులు రియాజ్, గణేష్, నాగరాజు, నవీన్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

‘నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్న ప్రభుత్వం’

ముషీరాబాద్: నిరసన తెలిపే హక్కును తెలంగాణ ప్రభుత్వం కాలరాస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు ఆరోపించారు. టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్న పత్రం లీకేజీపై నిరసన వ్యక్తం చేసిన బీజేవైఎం 11 మంది నాయకులను అక్రమంగా జైలులో పెట్టి 9 రోజులైన విడుదల చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే అరెస్ట్ చేసి జైలులో పెట్టిన వారిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం భోలక్‌పూర్ బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. లిక్కర్ స్కామ్‌కు పాల్పడిన ఎమ్మెల్సీ కవితను కేసుల నుంచి కాపాడుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్న బీఆర్‌ఎస్ మంత్రులు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. వేలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల నోటిఫికేషన్ లేక గత 8 ఏళ్లుగా ఎదురు చూస్తుంటే పేపర్ లీకేజీతో మరోసారి నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. అరెస్ట్ చేసిన బీజేవైఎం నేతలను ప్రభుత్వం విడుదల చేయాలని లేని పక్షంలో బీజేవైఎం నేతలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. బీజేపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు అరుణ్, బీజేపీ రాష్ట్ర ఇండస్ట్రియల్ కన్వీనర్ పార్థసారధి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు జైపాల్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్, నరేష్‌కుమార్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘ఎమ్మెల్యేపై చౌకబారు విమర్శలు మానుకోవాలి’



మాట్లాడుతున్న డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌ప్రసాద్ తదితరులు

ముషీరాబాద్: ఎమ్మెల్యే ముఠా గోపాల్‌పై ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ చౌకబారు విమర్శలు మానుకోవాలని ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు హెచ్చరించారు. మంగళవారం షేర్‌అలీ వీధిలో బీఆర్‌ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కె.నర్సింగ్‌ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బల్ల ప్రశాంత్, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధికోసం ఎమ్మెల్యేపై తప్పుడు విమర్శలు చేస్తున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులకు సహకరించాలన్నారు. డివిజన్ మాజీ అధ్యక్షుడు భిక్షపతియాదవ్, అజయ్‌ముదిరాజ్, మహిళా కమిటీ అధ్యక్షురాలు శోభ, బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు సోమ సుందర్, శ్రీధర్‌చారి తదితరులున్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ అశోక్

అంబర్‌పేట: యువత మత్తు పదార్థాల వైపు మొగ్గు చూపకుండా భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ అశోక్ సూచించారు. మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రూపొందించిన ‘సే నో టూ డ్రగ్స్ భగత్‌సింగ్ సందేశ్’ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా యువతకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. యువతను సామాజిక చైతన్యం కోసం స్ఫూర్తి నింపేలా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

- డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జావేద్ మాట్లాడుతూ.. ఈ నెల 23న సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ర్యాలీలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాయకులు నాగేందర్, యేసుదాసు తదితరులున్నారు.

‘అధికారుల నిర్లక్ష్యమే స్వప్నలోక్ అగ్ని ప్రమాదం’



కవాడిగూడ: జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యమే సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదంలో 6 మంది నిండు ప్రాణాలు కోల్పోయారని తెలంగాణ ఆమ్‌ఆద్మీ పార్టీ కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం కొవ్వొత్తులతో ఘనంగా నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రమాదాలపై తగిన చర్యలు తీసుకోకుండా నామమాత్రంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ.50 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మంగళవారం రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపల్లి, ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి (45) రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుడిచేతిపై అమ్మ, డాడి అని పచ్చబొట్టు, కడుపు పైన పుట్టు మచ్చ ఉందని పోలీసులు తెలిపారు. మృతుడి ఒంటిపై గోధుమ రంగు చొక్కా, నీలిరంగు ప్యాంటు ఉందని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సోమయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి..

కాచిగూడ: రైలు ఢీ కొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మంగళవారం రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీరాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉందానగర్ – తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (40) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై తెలుపు రంగు చొక్కా, చాక్లెట్ రంగు ప్యాంటు ఉంది. మృతుడి వివరాలు తెలిస్తే 8106801989 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

యువతి అదృశ్యం

నల్లకుంట: విధులకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్సై రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. జీవనోపాధి కోసం కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన సయ్యద్ ఇస్మాయిల్, గౌసియా బేగం దంపతులు తమ ముగ్గురు పిల్లలతో కలిసి నల్లకుంట రత్నానగర్‌లో నివాసం ఉంటున్నారు. శివంరోడ్డులోని ఓ బ్యూటీ పార్లర్‌లో బ్యూటీషియన్‌గా పనిచేస్తున్న వీరి పెద్ద కుమార్తె షబానాబేగం(22) ఈనెల 20న విధులకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా.. ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో వారు బ్యూటీ పార్లర్‌కు వెళ్లి ఆరా తీయగా.. షాప్ మూసివేసి ఉంది. బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా.. ఫలితం లేకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.